క్లుప్తంగా

కార్తీక దీపాలంకరణ



తిరునామంగా దీపాలంకరణ

కొయ్యలగూడెం: కార్తీక మాసం పురస్కరించుకొని శనివారం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో కార్తీక దీపాలంకరణ నిర్వహించారు. కార్తీక మాసం శ్రవణా నక్షత్రం రోజును కోటి సోమవారంగా పేర్కొంటారని, కోటి సోమవారాల పూజ ఫలాన్ని ఈరోజు అందిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలో తిరునామాలతో దీపాలంకరణ కార్యక్రమం భక్తులు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

పారిజాతగిరిలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానానికి కార్తీక శనివారం కావడంతో భక్తులు పోటెత్తారు. వేకుజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థప్రసాద గోష్టి, బాల భోగ నివేదన అనంతరం భక్తులకి స్వామివారు దర్శనం ఇచ్చారు టి.నరసాపురం మండలం బండివారిగూడెం, కోనసీమ జిల్లా అమలాపురం, వాడపల్లి నుంచి భక్తులు కాలినడకన వచ్చి స్వామివారి దర్శనం చేసుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. నరసన్నపాలెంనకు చెందిన జమ్మి గంగరాజు, భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు శనివారం ఉచిత అన్నప్రసాద దాతలుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, వాసవి సాయి నగేష్, దండు ధనరాజు, ఇళ్ల రామమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమలో సందడి

పోలవరం రూరల్: పట్టిసీమ శివక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు వాహనాలపై పట్టిసం రేవుకు చేరుకున్నారు. నదిలో లాంచీ దాటి శివ క్షేత్రానికి చేరుకుని శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు దేవస్థానం వద్ద ఉచిత ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చోరీ ఘటనలో రికవరీ సొమ్ము బాధితులకు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న సీఐ విల్సన్, ఎస్సై సుధాకర్

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో ఇటీవల జరిగిన చోరీ ఘటనలో నిందితుల నుంచి రికవరీ చేసిన సొమ్మును భీమడోలు పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు శనివారం రూ.2.80లక్షలు బాధితులకు అందజేశారు. భీమడోలు సీఐ కార్యాలయంలో ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి సీఐ యూజే విల్సన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన చిరు వ్యాపారి తుమ్మలపల్లి మహేశ్వరరావు సెప్టెంబర్ 18న భీమడోలు గణపతి సెంటర్‌లోని స్టేట్‌బ్యాంకు వద్ద రూ.3 లక్షల వ్యాపార లావాదేవీల నిమిత్తం చెక్ విత్ డ్రా చేసి తన బ్యాగులో ఆ సొమ్మును భద్రపర్చుకుని మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. భీమడోలు జంక్షన్‌లో ఆగి ఓ దుకాణంలోకి వెళ్లి బయటకు వచ్చి తన వాహనాన్ని స్టార్ట్ చేసే సమయంలో సొమ్ము అపహరించారని గ్రహించిన బాధితుడు మహేశ్వరరావు సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో అదే నెల 23న చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకుని వారి నుంచి రూ.2.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ సొమ్మును కోర్టు ఆదేశాల మేరకు భీమడోలు సీఐ కార్యాలయంలో బాధితులకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌సీ సూరిశెట్టి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎన్.ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని వేగవరానికి చెందిన మీసాల రమణ కామెర్లు, టైఫాయిడ్‌తో బాధపడుతున్నాడని..ఈ నెల 1న భార్యతో గొడవపడి గడ్డిమందు తాగాడన్నారు.. కుటుంబసభ్యులు రమణను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

పాతికేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు



ధర్మాజీగూడెంలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

ఇది ధర్మాజీగూడెంలో ప్రయాణికుల సౌకర్యార్థం పాతికేళ్ల క్రితం నిర్మించిన నూతన బస్టాండ్. ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. 1999 సంవత్సరంలో రూ.10 లక్షలతో రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన స్థలంలో ఈ బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఏమైందో ఏమో గానీ అప్పటినుంచి దీనిని ప్రారంభించకుండా అలానే వదిలేశారు. దీంతో చుట్టూ ముళ్లపొదలు, తుప్పలు పేరుకుపోయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పాత బస్ షెల్టర్‌లో సదుపాయాలు లేక ఇప్పటికీ ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త బస్ షెల్టర్‌లో సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రారంభిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

– లింగపాలెం

గ్రామ సింహాలతో బెంబేలు



ధర్మాజీగూడెంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

లింగపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల దాడిలో చిన్నపిల్లలు ఎక్కువగా గాయాల పాలవుతున్నారు. ఇటీవల కుక్కల వల్ల గాయపడిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి. మండలంలో రెండు నెలలుగా సుమారు 93 మంది కుక్కల వల్ల గాయాలపాలయ్యారు. కుక్కల కరవడం వలన రేబిస్ వ్యాధి సోకే ప్రమాదముందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మద్యం పాలసీ అంతా సిండికేట్ పద్ధతే



తాటాకులగూడెంలో విలేకర్లతో మాట్లాడుతున్న రాంబాబు

బుట్టాయగూడెం: ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ పేరుకే రిజర్వేషన్ తప్ప అంతా సిండికేట్‌గానే షాపులు నడుస్తున్నాయని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు ఆరోపించారు. జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెంలో ఆ సంఘ యువజన విభాగం అధ్యక్షుడు గంధం బోస్ నివాసం వద్ద శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం విధానం వల్ల పచ్చని కుటుంబాల్లో చిచ్చు రేపినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం, పోలవరం, టి.నరసాపురం, కొయ్యలగూడెం మండలాల్లో డిమాండ్‌ని బట్టి షాపులు కేటాయించారని అన్నారు. ముఖ్యమంత్రి ఒక పక్క మద్యం షాపులకు అనుసంధానంగా గొలుసుకట్టు దుకాణాలు (బెల్ట్ షాపులు) నడపవచ్చని చెప్పంటే నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ పాట పెట్టి గ్రామాల్లో బెల్ట్ షాపులు నడపడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. అధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే మద్యాన్ని ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తూ వినియోగదారుని జేబులకు చిల్లుపెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చుట్టూరి వెంకట్, కలపాల మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కొయ్యలగూడెంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం అధ్యక్షురాలు సీహెచ్ విజయకాంతం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు వంట షెడ్లు, మంచినీరు, గ్లౌజులు, మాస్కులు అందించాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో పథకాన్ని ప్రభుత్వం ఈ పథకాన్ని ఆరంభించడం మధ్యాహ్న భోజన కార్మికుల పొట్ట కొట్టే విధంగా ఉందన్నారు. ఈ పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, కానీ రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో ప్రైవేటు సంస్థలైన అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి సంస్థలకు కట్టబెడుతున్నారని, ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, గుర్తింపు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో పి.ప్రియాంక, ఎ.అంజలీదేవి, ఎల్లా చెల్లాయమ్మ, కె.సంకురమ్మ, ఎస్.నాగమ్మ, కె.ధనలక్ష్మి, జి.దుర్గ, జి.నాగమాధవి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డి సేవలు ఎనలేనివి



వర్ధంతి సభలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణ చైతన్య

చింతలపూడి: రైతు నాయకుడు సత్యన్నారాయణ రెడ్డి సేవలు ఎనలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో శనివారం కారుమూడి సత్యన్నారాయణ రెడ్డి 28వ వర్ధంతి పి సోమశేఖర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. రైతుల సమస్య పరిష్కారమే కారుమూడి సత్యన్నారాయణ రెడ్డికి ఇచ్చే ఘనమైన నివాళి అని సభలో పలువురు వక్తలు అన్నారు. ఈ సందర్భంగా కారుమూడి విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె గురవయ్య, సహాయ కార్యదర్శి టి బాబు, దొంతా కృష్ణ, జంగా రామచంద్రారెడ్డి, వరలక్ష్మి, పుల్లూరి శ్రీరావూచారి, తలారి గంగరాజు, కొల్లి వీరవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు

రైతుల ఆవేదన

జంగారెడ్డిగూడెం: రికార్డుల్లో ఉన్న ప్రభుత్వ దారిని సర్వే చేసి వెలుగులోకి తీసుకురావాలని తాడువాయి, చిన్నవారిగూడెం రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పుంతదారిగా పేర్కొంటున్న భూమి బండారు రామారావు, బండారు గంగారావు, మాదాసు గంగారావు, మాదాసు వీర్రాజు, మాదాసు మల్లారావు అనే వ్యక్తులకు చెందిన పట్టా భూమి అని తెలిపారు. అయితే మరో వర్గానికి చెందిన రైతులు తమ భూమిని పుంతదారిగా వినియోగిస్తున్నారని, సర్వే చేసి మా భూమిని మాకు అప్పగించాలని తహసీల్దార్, ఆర్డీవోలను రైతులు కోరారు. దీంతో స్పందించిన అధికారులు ఈ నెల 5వ తేదీన మండల సర్వేయర్‌ను సర్వే నిమిత్తం పంపించారు. తాడువాయి, చిన్నవారిగూడెం గ్రామాలకు చెందిన రైతుల సమక్షంలో సర్వే చేసి, పుంతదారిగా వినియోగిస్తున్న భూమి పైన పేర్కొన్న రైతులకు చెందినది వారు నిర్ధారించారన్నారు. విషయాన్ని సర్వేయర్ మండల తహసీల్దార్‌కు నివేదించగా, 6వ తేదీన సమగ్ర సర్వేకు ఆదేశించారు. సర్వేలో ప్రభుత్వ పుంతదారి తాడువాయి, చిన్నవారిగూడెం చెందిన కొందరు రైతులు ఆక్రమించినట్లుగా తెలిసిందన్నారు.

టీడీపీ మాయాజాలం

ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయం తెలిసినప్పటికీ ఆ భూమిని రహదారిగా మార్చకుండా అధికార టీడీపీ నాయకులు పావులు కదుపుతున్నారు. ప్రభుత్వ భూమికి బదులుగా పట్టా భూమిని పుంతదారికి మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో టీడీపీ నాయకుల చర్యలపై రైతులు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నారు. ప్రభుత్వ భూమిని బయటకు తీయకుండా అధికారులు మిన్నకుండిపోతే, ప్రతి ఒక్కరూ దీనిని ఆలుసుగా తీసుకుని ఆక్రమణలు మొదలు పెడతారని, తరువాత ప్రభుత్వ భూమి అనేదే కానరాదన్నారు. కావున అధికారులు ఈ విషయంపై స్పందించి చిన్నవారిగూడెం నంచి తాడువాయి శివాలయానికి రికార్డెడ్‌గా ఉన్న ప్రభుత్వ దారికి సర్వే చేసి రోడ్డు నిర్మించాలని కోరారు.

నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి



రెడ్డిగణపవరంలో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇచ్చి పునరావాసం కల్పించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. బుట్టాయగూడెంలో శనివారం నిర్వహించిన ఆ పార్టీ 8వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. తాతముత్తాతల కాలం నుంచి ఏజెన్సీప్రాంతంలో ఎల్టీఆర్, 1/70 చట్టంలో వేలాది ఎకరాలు గిరిజనేతరులు అక్రమంగా సాగు చేస్తున్నారని చట్ట ప్రకారం స్థానిక ఆదివాసీలకు హక్కుపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరంనకు నిధులు విడుదల చేశామని నిత్యం గొప్పలు చెప్పుకుంటుందని, ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయి నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. రవి మాట్లాడుతూ ప్రభుత్వం ఏజెన్సీలో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకూ మారుమూల గ్రామాల్లో పాఠశాలలే లేవని, కొన్ని గ్రామాల్లో పాఠశాలలకు కనీస భవనాలు వసతులు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాష విద్యా వలంటీర్‌లకు వేతన బకాయిలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తొలుత అమరుడు కొమరం బాబూరావు స్మారక స్థూపం వద్ద పార్టీ సీనియర్ నాయకులు కోర్సా జలపాలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్మారక స్థూపం నుంచి రుద్రరాజు సత్యనారాయణరాజు నగర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తామా ముత్యాలమ్మ, వెట్టి వీరయ్య, పోలోజు నాగేశ్వరరావు, తెల్లం రామకృష్ణ, ఎం. నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ప్రోత్సాహకం అందజేత



భార్గవికి ప్రోత్సాహకాన్ని అందిస్తున్న చింతలపూడి రాయల్ క్లబ్ సభ్యులు

చింతలపూడి: క్రీడాకారిణి భార్గవికి చింతలపూడి రాయల్ క్లబ్ సభ్యులు ప్రోత్సాహకాన్ని అందించారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే నేషనల్ అథ్లెటిక్స్ డిస్కస్‌త్రో పోటీలకు అండర్ 19 విభాగంలో భార్గవి అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆమె ప్రయాణ ఖర్చుల నిమిత్తం రాయల్‌క్లబ్ సభ్యులు రూ.13,500 శనివారం అందజేశారు. కాగా భార్గవి ఆల్ ఇండియా స్థాయిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన అథ్లెటిక్స్ అండర్ 18 పోటీల్లో జావెలిన్ త్రో, షాట్ పుట్ రెండింటిలో బంగారు పతకాలు సాధించింది. రాష్ట్ర స్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జావెలిన్ త్రో పోటీల్లో కాంస్యం, రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ జావెలిన్ త్రో పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా భార్గవిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో రాయల్ క్లబ్ అధ్యక్షుడు ఊసా సుబ్బారావు, సెక్రటరీ కురిసెట్టి విజయ్‌కుమార్, ట్రెజరర్ ఆకుల రమేష్, గౌరవ అధ్యక్షుడు కొండపల్లి శేషగిరిరావు, గంధం శ్రీనివాసరావు, గంధం రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న స్థానికులు



స్థానికులు అడ్డుకోవడంతో పోలవరం కాలువపై నిలిచిన జేసీబీ

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో పోలవరం కుడి కాల్వ గట్టుపై శుక్రవారం రాత్రి జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను కొందరు స్థానికులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గత కొన్నాళ్లుగా పంగిడిగూడెం వద్ద పోలవరం కుడికాల్వ గట్టును కొందరు తెలుగు తమ్ముళ్లు అక్రమంగా కొల్లగొడుతున్నారు. కేవలం రాత్రి వేళల్లో మాత్రమే తవ్వకాలను చేపడుతున్నారు. తవ్విన మట్టిని ఏలూరు పరిసర ప్రాంతాలకు వేలాది రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్లు రాకపోకల కారణంగా కాల్వగట్టు మార్గం రహదారులు దెబ్బతింటున్నాయని ఆగ్రహించిన కొందరు స్థానికులు తవ్వకాలను అడ్డుకున్నారు. దాంతో టిప్పర్, ట్రాక్టర్ డ్రైవర్లు వాహనాలతో సహ అక్కడ నుంచి ఊడాయించారు. అయితే జేసీబీ, అక్కడ తవ్వుతున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

మైక్‌లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని వినతి



శ్రీవారి దేవస్థానం చైర్మన్ సుధాకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గతంలో ఉన్న మాదిరిగా కాపు కల్యాణ మండపం వరకు మైక్‌లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావును స్థానిక కాపు కల్యాణ మండప ట్రస్టు వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా కొండపైన చైర్మన్ ఛాంబర్‌లో ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో తమ కల్యాణ మండపం వరకు ఉన్న దేవస్థానం మైక్‌ల ద్వారా అన్నమాచార్య కీర్తనలు, వేద మంత్రాలు వినిపించేవని, అలాగే స్ట్రీట్‌ల ద్వారా విద్యుత్ వెలుగులు ప్రసరించేవన్నారు. దాంతో కల్యాణ మండపాల్లో వివాహాలు జరిగే సమయాల్లో పెళ్లిబృందాలు ప్రశాంత వాతావరణంలో, ఆధ్యాత్మిక చింతనతో ఉండేవారన్నారు. ఇప్పుడు మైక్‌లు, స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో ఆ వాతావరణం కనుమరుగు అయ్యిందన్నారు.

ఏటీఏ ఆవిర్భావ దినోత్సవం



జిన్నెలగూడెంలో ఏటీఏ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెంలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. జిన్నెలగూడెం పాఠశాలలో పాయం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర కోశాధికారి వంజం ధర్మరాజు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఏజెన్సీలో నూరు శాతం నియామకాలు, పదోన్నతులు సాధించడంలో ఏటీఏ విశేష కృషిచేసిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ జీవో నెంబర్ 3 లేదా ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం తీసుకువచ్చే వరకు ఆదివాసులంతా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పూరెం సీతారామయ్య, బంధం వీరబాబు, మడకం ప్రమీల, కూరం రమేష్, పూనెం సుందర్, వెంకట్‌నారాయణ వినోద్, రాంబాబు, పాపారావు, రమాదేవి, జయ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఏటీఏ జిల్లా అధ్యక్షుడు సరియం నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు మాట్లాడుతూ ఏటీఏ ఉద్యమ కార్యాచరణలో షెడ్యూల్ ప్రాంత ఉపాధ్యాయులకు అనేక విజయాలను సాధించడం జరిగిందని చెప్పారు. తొలుత జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న బి.గోపీ మూర్తికి ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం రాములు, కుంజా రమేష్, సోదెం రాజు, తెల్లం గంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సేవ ఎన్‌సీసీలో ఒక భాగం



లిబర్టీ చిల్డ్రన్స్ హోం చిన్నారులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు స్థానిక లిబర్టీ చిల్డ్రన్స్ హోంను శనివారం సందర్శించారు. చిల్డ్రన్స్ హోంలో ఉన్న విద్యార్థులతో ఆటల పోటీలు నిర్వహించారు. స్వయంగా భోజనాలు వండి చిన్నారులకు వడ్డించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ జి జీవన మౌనిక మాట్లాడుతూ సామాజిక సేవ, సమాజ అభివృద్ధి ఎన్‌సీసీ శిక్షణలో ఒక భాగమన్నారు. దీనిని ప్రతి క్యాడెట్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంపట్ల సేవా దృక్పథంతో మెలగాలని సూచించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

కొయ్యలగూడెం: సరిపల్లి గ్రామపంచాయతీ గిరిజన గ్రామం వంక బొత్తప్పగూడెం గ్రామంలో శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో వంకా సత్యనారాయణకి చెందిన ఇల్లు దగ్ధమైంది. సత్యనారాయణ తన కొడుకు మంగరాజుతో ఇంటిలోని వేర్వేరు పోర్షన్‌లలో నివాసం ఉంటున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని వీఆర్‌వో అడపా రాంబాబు తెలిపారు.

సారా పట్టివేత

కామవరపుకోట: మండలంలోని వడ్లపట్ల నూతన గ్రామంలో నాటు సారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 లీటర్ల సారా స్వాధీన పరుచుకుని, ఓ మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి పరామర్శ



లక్ష్మీకాంతం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జెట్టి, పార్టీ నేతలు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మేకల అన్నవరం కుటుంబాన్ని శనివారం పలువురు నేతలు పరామర్శించారు. అన్నవరం తల్లి లక్ష్మీకాంతం ఇటీవల మృతి చెందడంతో పోలవరం, చింతలపూడి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకులు జెట్టి గురునాధరావు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నవరం నివాసానికి వెళ్లి మేకల బ్రదర్స్‌ని పరామర్శించారు. లక్ష్మీకాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అతిరాస కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి తదితరులు అన్నవరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'అభయ'తో మహిళలకు భద్రత



ఏలూరులో కళాశాల విద్యార్థినులతో అభయ పోలీస్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మహిళలు, చిన్నారులు, విద్యార్థినుల రక్షణకు ఏలూరు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. గతంలో దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్ల తరహాలోనే నేడు అభయ యాప్‌ను రూపొందించి, పక్కాగా అమలు చేస్తోంది. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చొరవ, ప్రత్యేక శ్రద్ధతో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నారు. మహిళలు, విద్యార్థినులకు ఆపద వస్తే అభయ యాప్ లేదా డయల్ 112కు ఫోన్ చేస్తే 10 నిమిషాల్లోనే బాధితులకు రక్షణగా నిలిచేలా చర్యలు చేపట్టారు. ఏలూరు నగరంలో ఐదు అభయ టీమ్స్‌ను ఎస్పీ కేపీ శివకిషోర్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ, టూటౌన్ మహిళా ఎస్సై నాగకళ్యాణి, ఒక్కో స్టేషన్ నుంచి మహిళా పోలీస్, గ్రామాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శితోపాటు పోలీస్ కానిస్టేబుల్స్ అభయ టీమ్‌లో ఉన్నారు. వీరంతా నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, పాఠశాలలు, రద్దీ ప్రాంతాల్లో మహిళలకు రక్షణగా నిలుస్తున్నారు.

ఆయుర్వేద వైద్యం శ్రేష్టం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయుర్వేద వైద్యం ఎంతో శ్రేష్టమైందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీవీఎం నగేష్ అన్నారు. శనివారం స్థానిక వన్‌టౌన్లోని గీతా భవన్‌లో లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 102 మందికి వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుర్వేద వైద్యానికి పురాణ కాలం నుంచి గుర్తింపు ఉందని నగేష్ అన్నారు. మన పరిసర ప్రాంతాల్లో వనమూలికలు, ఆకులు, దినుసుల ద్వారా ఔషధాలు తయారు చేసి ఇవ్వడం, రసాయన పదార్థాల కల్తీ లేకపోవడం, ఆయుర్వేద మందుల వినియోగం ఉపయుక్తంగా, స్వల్పకాలంలో వ్యాధి నివారణకు ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో నంగులూరి లక్ష్మీ నరసింహారావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.